క్లుప్తంగా

ఆత్మీయ వీడ్కోలు



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న గ్రామస్తులు

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కింజేరు గ్రామ జీపీఎస్ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు సీతన్నను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సోమవారం గ్రామంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీతన్న మాస్టారు ఎంతో సేవాభావంతో పనిచేసి, విద్యార్థులకు ఉత్తమ బోధనలు అందించారన్నారు. గ్రామస్తులు ధర్మ , నీలరాం, తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీల సర్వే వేగవంతం



సమావేశానికి హాజరైన అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీవో చంద్రశేఖరరావు సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీవీటీజీల సర్వే వేగవంతం చేయాలని, అమ్మఒడి ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు తీరును సమీక్షించారు. ఎంఈవో బాబూరావు పడాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, తదితరుల పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై వినతి

చింతూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేషియల్ రికగ్నైజర్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పనిభారం తగ్గించాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. అనంతరం వారు సీడీపీవో విజయగౌరికి వినతిపత్రం అందజేశారు. దుర్గ, జయ, వెంకటరమణ, వసంత, పార్వతి, పొదమ్మ, శేషమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త పనితీరుపై ధ్వజం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ భవాని

వీఆర్ పురం: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వడ్డిగుడెం అంగన్‌వాడీ కేంద్రం -1 కార్యకర్తపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ ముత్యాల భవాని అన్నారు. స్థానిక కేంద్రాన్ని ఆమె సోమవారం ఉదయం 9.30 గంటలకు సందర్శించారు. ఆ సమయంలో కార్యకర్త విధుల్లో లేకపోవడంపై ఆయాను ఆమె ప్రశ్నించారు. కార్యకర్త వచ్చి వెళ్లిపోయారని సమాధానం చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యకర్త పనితీరు సక్రమంగా లేదని విధుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆమెపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనునట్లు భవాని చెప్పారు.

తమ్మన్నదొర పోరాటం మరవులేనిది

రంపచోడవరం: బందపల్లిలో సర్పంచ్ కారం స్వామి దొర ఆధ్వర్యంలో కారం తమ్మన్న దొర సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ముసురుమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశీ కుంజం మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వం విధిస్తున్న పన్నులకు వ్యతిరేకంగా తమ్మన్నదొర చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఆయన చేసిన తిరుగుబాటు విశాఖ, భద్రాచలం, రేకపల్లి, చోడవరం తదితర ప్రాంతాలకు అప్పట్లో విస్తరించిందన్నారు. తమ్మన్నదొర పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఆయన చరిత్రను గిరిజన విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తమ్మన్నదొర కుటుంబీకులకు సన్మానించారు. ఎంపీటీసీ సాయిబాబా, జెఏసీ వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, బంగారు బాబు, సూర్యనారాయణ, వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఊరూరా తిరంగా ర్యాలీలు

- ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపు



అనంతగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎంపీపీ శెట్టి నీలవేణి



అరకులోయలోని డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు



హర్‌గర్ తిరంగా నిర్వహిస్తున్న అధికారులు



కొయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, తహశీల్దారు తదితరులు



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో, విద్యార్థులు

అరకులోయటౌన్: భారత దేశ జాతీయ జెండాను ప్రతీ ఒక్కరి ఇంటిపైన ఎగుర వేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ భరత్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలో నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ దేశ జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మన ఇంటిపైన జాతీయ పతాకాన్ని ఎగుర వేసి మన దేశ భక్తిని చాటి చెప్పాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓలు పి. నాగరాజు, వై. విజయలక్ష్మి, ఎం.అనితాకుమారి, వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, ఎం.కృష్ణమోహన్, పి.సుందరీరాణి, గుర్రయ్య, రాజు, జి.సంధ్య, కె.గోపాలకృష్ణ, ఎస్.అప్పారావు, వి.కామేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతగిరి: ప్రతి భారతీయుడు దేశభక్తిని చాటాలని ఎంపీపీ శెట్టినీలవేణి అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన వారపు సంత వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో దేశభక్తిని పెంచుకోవాలని, జాతీయ జెండాపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కుమార్, ఏపీవో అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: ప్రతీ ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జండాను ఎగురవేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. మండలకేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ జాతీయ జెండాను ఇంటిపై ఎగరవేసి దేశభక్తిని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ సుభద్ర, వైస్ ఎంపీపీ ఆనంద్, రింతాడ ఎంపీటీసీ ఓం ప్రకాషిణి, అరుణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు

జి.మాడుగుల: స్వాతంత్ర సమరయోధుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఎంఈవో సీహెచ్.బాబూరావుపడాల్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి జి.మాడుగుల పురవీధుల్లో సోమవారం మండల అధికార్లు, విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఎంఈవో–2సుందరమ్మ, సీడీపీవో సుందరమ్మ, ఏటీడబ్ల్యూవో తిరిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు: దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో లాలం సీతయ్య కోరారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుల ప్రాణత్యాగాలతో స్వతంత్రం వచ్చిందన్నారు. దేశాన్ని ఐక్యంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు అంతా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని కోరారు. ఏవో బాల మురళీకృష్ణ, ఈవోఆర్‌డీ నాయుడు పాల్గొన్నారు

ఉప్పలపాడులో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సిబ్బంది

అడ్డతీగల: మండలంలోని ఉప్పలపాడులో ఏడీఎంహెచ్‌వో భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జ్వర బాధితులున్నట్టు అందిన సమాచారం మేరకు శిబిరం నిర్వహించి, 49 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. ఇందులో భాగంగా 18 సాధారణ జ్వరం కేసులు నమోదయ్యాయని, మరో 18 మంది సాధరణ నీరసం కాళ్ళు, ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించామన్నారు. కంటి సంబంధిత సమస్యలతో ముగ్గురు బాధపడుతున్నారని,10 మందికి ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరికీ తగిన మందులు అందజేశామన్నారు. గ్రామమంతా బ్లీచింగ్ చల్లించి, దోమల నివారణ మందు ఫాగింగ్ పనులు చేయించామన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్ తప్పనిసరి



ఈ–క్రాప్ యాప్‌లో రైతు, పంట ఫోటో తీస్తున్న సిబ్బంది, పక్కన ఏవో ఉమాదేవి

కొయ్యూరు: ప్రతి రైతు తప్పనిసరిగా పంటలను ఈ–క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయాకారి ఉమాదేవి చెప్పారు. ఆమె సోమవారం సిబ్బందితో మండల కేంద్రంలో పలు ప్రాంతాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. ఇందులో భాగంగా రైతులకు ఈ–క్రాప్‌పై అవగాహన కల్పించారు. పలు రైతుల పంటలకు సంబంధించి ఈ–క్రాప్‌లో వివరాలు నమోదుచేశారు. ఆమె మాట్లాడుతూ పంటలను ఈ –క్రాప్‌లో నమోదుచేసుకోవడంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల నంట జరిగినపుడు పరిహారం అందుతుందన్నారు. వర్షాభావం వల్ల మండలంలోని 1650 హెక్టార్లకు గాను 259 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు పూర్తయినట్టు తెలిపారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో సాగు వరి నారుమడి దశలో ఉందన్నారు. వర్షాలు లేక నాట్లు ఆలస్యమవుతున్నాయన్నారు. పర్యటనలో ఆమెతో పాటు విస్తరణ అధికారి వెంకన్న ఉన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



అనంతగిరిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్ల, తదితరులు



చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

చింతూరు: మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలకు నిరసనగా డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం చింతూరులో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు తదితరులు మాట్లాడుతూ మణిపూర్ జరుగుతున్న ఘటనలు చాలా దారుణమని, హింసాత్మక ఘటనలో క్రైస్తవుల ఆస్తులు, చర్చిలు ధ్వంసం చేస్తున్నారన్నారు. నిస్సహాయులైన మణిపూర్ ప్రజలకు ఆహారం, వైద్యం అందించాలని, హింసకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వారు ఐటీడీఏ ఏవో రాజ్‌కుమార్, తహసీల్దార్ కారం సుబ్బారావుకు వినతిపత్రం అందచేశారు. కృపారావు, పీటర్‌సింగ్, రాం రాబర్ట్, మోహన్‌దాస్ పాల్గొన్నారు.

అనంతగిరి: మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులను చక్కదిద్ది, సాధారణ ప్రజా జీవన విధానాన్ని నెలకొల్పాలని, మండల కేంద్రంలో సోమవారం మండల పాస్టర్స్ ఆధ్వర్యంలోని క్రైస్తవులు భారీ ర్యాలీ చేపట్టారు. ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజనులపై దాడులను ఖండిస్తున్నామని, శాంతియుత వాతవరణం నెలకొల్పాలన్నారు. ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ కుమార్, నీలయ్య, జోషప్, పీటర్, డేవిడ్‌పాల్, ఐక్యవేదిక ప్రతినిధులు ఆనందరావు, బాబూరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి నాట్లు

- చోడి కలుపుతీతల్లో గిరిరైతులు నిమగ్నం
- వరుణుడి కరుణ కోసం ఎదురుచూపులు



వరినాట్లు వేస్తున్న గిరిజన రైతులు

అరకులోయటౌన్: అరకులోయ వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో వరినాట్లు చివరి దశకు చేరగా, చోడి(రాగులు) సాగు చేసిన గిరిరైతులు కలుపు తీత పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ ఏడాది సబ్ డివిజన్ పరిధిలో 16వేల హెక్టార్లు వరి సాగులో ఉండగా, 9వేల 300 హెక్టార్లలో రాగులు సాగులో ఉన్నాయని, అల్లం, మిరప, ఇతర కూరకాయలు మరో 535 హెక్టార్లలో సాగులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ వంగవీటి మోహన్‌రావు తెలిపారు. గత కొన్ని రోజులుగా వర్షాభావంతో రాగులు, వరి కలుపు తీత అనుకూలంగా ఉందని గిరిరైతులు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా వర్షాలు కురవకపోవడంతో కూరగాయలు, మెట్ట పొలాల్లో వరినాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం గిరిజన రైతులు ఎదురుచూస్తున్నారు.

రేపు అభివృద్ధి పనులు ప్రారంభం

అడ్డతీగల: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలతో పాటు రాజుంపాలెంలోని పాఠశాల భవన నిర్మాణానికి ఈనెల 16న భూమిపూజ కార్యక్రమాలను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు నిర్వహిస్తారని ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు.అలాగే అదే రోజు అడ్డతీగల మండలం గొండోలు, సరంపేట గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు.

18న చలో ఐటీడీఏ

అరకులోయటౌన్: ఆదిమ జాతి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న చేపట్టనున్న చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. పద్మాపురం పంచాయతీ బొందుగుడ గ్రామంలో సోమవారం జరిగిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అధిక సంఖ్యలో పీవీటీజీలు పాల్గొవాలని కోరారు. గిరిజన సంఘం రామారావు, పద్మాపురం ఉప సర్పంచ్ భగత్‌రామ్ తదితరులున్నారు.

బీజేపీ శ్రేణుల కాగడాల ప్రదర్శన



పాడేరులో కాగడాల ప్రదర్శన చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

సాక్షి, పాడేరు: మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు సోమవారం తలారిసింగి పెట్రోల్ బంక్ నుంచి పాతబస్టాండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సెంటర్ వరకు కాగడాలతో ర్యాలీ చేపట్టారు. పలువురు మాట్లాడుతూ 1947, ఆగస్టు 14 పాకిస్తాన్, భారతదేశం దేశ విభజన చీకటి రోజు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, రామకృష్ణ, కొండబాబు, గోపాలపాత్రుడు, మత్స్యకొండబాబు, చిన్నయ్య, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అజొల్లా ఉండగా.. యూరియా దండగ

రోలుగుంట: అజొల్లా ఉండగా.. యూరియా దండగ అని ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి అన్నారు. కొంతలం గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ దేవి అజొల్లా వినియోగం, యూరియాకు అజొల్లాకు మధ్య వ్యత్యాసం గురించి వివరించారు. అజొల్లా వినియోగంతో ఒనగూరే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా బదులుగా దీన్ని వినియోగిస్తే కలుపు నియంత్రణ వేగవంతమవుతుందన్నారు. పంటలో పిలకల వృద్ధి మెరుగ్గా ఉంటుందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన రైతులు అడ్దూరి శ్రీను, కోరుకొండ కృష్ణ, నిట్టా పద్మ, గూడెపు సుజాత, కోరుకొండ వెంకటరాజు తదితర రైతులతో వారి వరి పొలాల్లో అజొల్లా వేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది సాంబమూర్తి, రాంబాబు, ప్రసాద్, సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి



మాడగల పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ జ్యోతి, సభ్యులు



పనసలపాలెం గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



సొవ్వలో మొక్కలు నాటుతున్న పంచాయతీ కార్యదర్శి ,వార్డు సభ్యులు

అరకులోయటౌన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాడగడ పీహెచ్‌సీ ఆవరణలో నా మట్టి – నా దేశం స్థూపాన్ని సర్పంచ్ ఎం.జ్యోతి ప్రారంభించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య కోసం పోరాడిన వీరులను స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. విప్లవ పోరాట వీరుడు మర్రి కామయ్యని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.బాలరాజు, సచివాలయ కార్యదర్శులు రాజబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: చెట్లు నాటు కోవడంతోనే స్వచ్ఛమైన గాలి వస్తుందని అందుకే చెట్లు నాటుకోవాలని పంచాయతీ కార్యదర్శి సద్దు అన్నారు. మండలంలోని సొవ్వ పంచాయతీ నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి వంతల సద్దు చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఎన్ఆర్‌ఈజీఎస్ అధికారులు లక్ష్మి, రెల్లి పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని కొండగొకిరి, రత్నంపేటలో జరిగిన నా మట్టి – నా దేశం కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్ పాల్గొని మహానుభావుల ప్రాణత్యాగాలు కారణంగా స్వేచ్ఛ స్వతంత్రాలను అనుభవిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం ద్వారా దానిని సంరక్షించాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, రత్నంపేట సర్పంచ్ పాటి నూకరత్నం, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, నేతలు వనంబాబు, శేఖర్, తిరుపతి, ఏపీవో రాజు తదితరులు పాల్గొన్నారు

వై.రామవరం: మండలంలోని గ్రామాల్లో సోమవారం ఏపీవో ప్రకాశరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నా మట్టి– నా దేశం కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పనసలపాలెం సచివాలయం వద్ద ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ రోలిపల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొని సమరయోధులను స్మరించుకుని మౌనం పాటించారు. పచ్చని మొక్కలు నాటారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండల కేంద్రంలోని నడివీధిలో సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగిన నా మట్టి– నా దేశం కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరంలో అశువులు బాసిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. డీఎల్‌పీవో రాఘవన్ , డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కోటేశ్వరరావు, ఏపీవో సాయిబాబా , పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రంపచోడవరంలో అమర వీరులకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ బొజ్జయ్య



పనసలపాలెంలో గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ రమేష్, నేతలు

ఆదివాసీల గ్రామాలను అభివృద్ధి చేయాలి

జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి పంచాయతీ కె.పెదబయలు గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాలు అభివృద్ధి చేయాలన్నారు. పీవీటీజీలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, సీసీడీపీ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేయాలని డిమాండ్ చేశారు. సన్యాసయ్య, అప్పారావు, సూరిబాబు, ఏసుపు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్ రాక

సాక్షి, పాడేరు: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం పాడేరు పర్యటిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రకటనలో తెలిపారు. తలారిసింగి క్రీడా మైదానంలో ఉదయం 9గంటలకు జరిగే జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో పాల్గొంటారని, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పంటమార్పిడిని అలవర్చుకోవాలి

మాకవరపాలెం: పంటమార్పిడి విధానాన్ని రైతులు అలవర్చుకోవాలని ఏవో చిరంజీవి సూచించారు. నారాయణరాజుపేటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటమార్పిడి వల్ల కలిగే లాభాలు, ఖరీఫ్ సీజన్‌లో వరిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శేషునాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుదర్శన్, కవిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.